

# ఎనిమిదో అడుగు

నెట్టిమి
రమణారావు

**మా**జీ మునసబు దగ్గర్నుంచి వీర్రాజును రమ్మనమని కబురు వచ్చింది. వెళ్లిన వీర్రాజు - ఆయన ముందు చేతులు కట్టుకుని నుంచున్నాడు. వీర్రాజు దృష్టిలో అతడు మాజీ మునసబు. కానీ అతడు ప్రస్తుత సర్పంచ్ కూడా.

సర్పంచ్ బయటకు వచ్చి -

"ఏరా ఈర్రాజో బాగున్నావా...." ఎటో చూస్తూ అడిగేడు.

"తమరికి తెలియంది ఏటుంది బాబూ..... కాయకష్టం సేయగలిగినోళ్లంతా వలసలు పోయి ఆళ కుటమాల్ని పోషించుకుంటు న్నారు. నాలాంటి రోగిస్టోలుండిపోన్రు... నా నడుంనొప్పితో నేనెళ్లలేక పోన్ను.... శానా కష్టంగుంది రోజులెల్లడం......" అంటూ వాపోయేడు, వీర్రాజు.

వీర్రాజు ఒకప్పుడు శరీర కష్టం నమ్ముకున్నాడు. ఏడాది క్రితం తన పనిలో నిమగ్నమై ఉన్నప్పుడు నడుముకు పెద్ద ప్రమాదమే జరిగింది. కోలుకునే సరికి సంవత్సరం పట్టింది. బరువు పనులకు పనికిరాడు. ఊర్లోనే చిన్నా చితకా పనులు చేద్దామన్నా - రెండేళ్లుగా వర్షాలు పూర్తిగా లేకపోవడంతో కళకళలాడిన ఆ

గ్రామం కళ తప్పింది. పనులు తగ్గాయి. దయా ధర్మాలు పలచనయ్యాయి. దాంతో అందరూ పనులకోసం వలసలనాశ్రయించేరు. వీర్రాజుకు వెళ్లలేని పరిస్థితి.

"........ఆ........ఆ.... అందుకేరా నిన్ను పిలిపించాను...." అన్నాడు సర్పంచ్.

ఎందుకోసనమో అన్నట్టుగా సర్పంచ్‌వైపు చూసాడు వీర్రాజు.

"ఏం లేదూ. హైదరాబాద్‌లో నున్న మా అల్లుడిగారింట్లో ఓ మనిషి సాయం కావాలంట.... నమ్మకమైన వాళ్లుంటే పంపమని కబురెట్టాడు....."

"నానెల్లి పనిచేయగలనా బాబూ.....ఇక్కడికే పనికి రానోణ్ణి"

"నువ్వు కాదురా.... నీ కూతురుంది కదా.... దాని బాగోగులన్నీ ఆళ్లే చూసుకుంటూ నెలకు కొద్దోగొప్పో డబ్బులు సర్దుతారు. నీకూ దినం గడుస్తాది.... ఏటంటావు? నీ పొరుగున్న చెంద్రిగాడు ఆడికూతుర్ని పంపుతానంటున్నాడు.... ఆడి కూతురు ఈడుదే కదా! పదకొండు సంవత్సరాలు దాటుంతాయి కదా! మీ ఆడోళ్ళతో ఆలోచించి ఏమాటో చెప్పు.... రేపే ప్రయాణం...." ఇక నువ్వెళ్లు అన్నట్టుగా చుట్ట కాల్చడంలో మునిగిపోయేడు సర్పంచ్.


ఆలోచిస్తూ ఇంటిదారి పట్టాడు వీర్రాజు. ఇంటికెళ్లి భార్య రంగమ్మకు విషయమంతా చెప్పాడు. కూతుర్ని పరాయింటికి పంపడం ఎంతమాత్రం ఇష్టం లేదంది రంగమ్మ.

కానీ - పిల్ల పోషణ భారం తగ్గిపోయి నెలకు నాలుగైదు వందలన్నా వస్తాయంటే ఆశగా వుంది వీర్రాజుకు. పేగుబంధం ఒకవైపు. పేగు నిండే దారొకవైపు. ఆ రాత్రి భార్యా భర్తలిద్దరూ లజ్జుగుజ్జులు పడ్డారు. ఆఖరికి ఆకలే గెలిచింది.

వీర్రాజు కూతురు అనిత హైదరాబాద్ ప్రయాణం ఖరారైంది.

చిన్నపిల్లయిన అనితకు హైదరాబాద్ అంటే సరదాగానూ ఉంది. ఎప్పుడూ అమ్మకొంగు వీడని తనకి గుబులుగానూ ఉంది. ఇంట్లో వాళ్లు నెలరోజులే అని చెప్పారు. ఎంత సేపు గడిచిపోడానికి హైదరాబాదంతా చూడొచ్చు. ఆళ్లు కూడా తెలిసినోళ్లే. సర్ది చెప్పుకుంది, అనిత తనకు తాను.

తెల్లవారింది. తనకున్న నాలుగు గౌన్లను చేతిసంచీలో పెట్టుకుని ప్రయాణానికి సిద్ధమైంది అనిత. బిడ్డను అంతదూరం పంపి తానుండలేనని రంగమ్మ అంటూనే ఉంది. వీర్రాజు భార్య మాట



వినిపించుకోలేదు. సర్పంచ్ ఇంటికి అనితను దిగబెట్టి వారిచ్చిన బయానా డబ్బులు పుచ్చుకొని వచ్చేశాడు.

✿ ✿ ✿

పంచాయితీ ఎలక్షన్ హడావిడి మొదలైంది. ఊరంతా హడావిడిగా ఉంది. సర్పంచ్ యింటివద్ద ఎప్పుడూ గుంపులు గుంపులుగా జనం. వీర్రాజు సర్పంచ్ తరుఫున ప్రచారంలో పాల్గొంటున్నాడు. అతని చిల్లర ఖర్చులు ఒడ్డెక్కుతున్నాయి. ఎప్పుడో మర్చిపోయిన మద్యం రుచీ చూస్తున్నాడు.

ఓ ఉదయం హఠాత్తుగా రంగమ్మని ఉన్న పళంగా రమ్మనమని కబురు పెట్టింది సర్పంచ్ భార్య. హైదరాబాద్‌నుంచి అనిత ఫోన్ చేసిందట ఆ మాట చెవిలో పడగానే అనేక సంశయాలతో ఆదరాబాదరాగా పరుగు తీసింది రంగమ్మ.

"రావే....రా!..... కొంచెంసేపాగు, మళ్ళీ వస్తాది ఫోను....." అంది. కూర్చోమని అరుగును చూపించింది.

రంగమ్మ మనసులో కీడును సూచించే ఆలోచనలే పరుగులెత్తుతున్నాయి. మనసు మనసులో లేదు.

ఇంతలో ట్రింగ్... ట్రింగ్.... మంటూ ఫోన్ మోగింది. రంగమ్మ ఉలిక్కిపడింది. ఫోన్ బయటకు తీసుకొచ్చి పెట్టింది సర్పంచ్ భార్య.

రంగమ్మ వణుకుతున్న చేత్తో ఫోన్ అందుకొని 'హలో' అంది. అవతల నుంచి అనిత మాటలు గొంతులోంచి రావట్లేదు.

'అమ్మా' అన్న పిలుపు మాత్రం వినిపించింది రంగమ్మకు.

ఆ గొంతులో బాధ గ్రహించేసింది కన్నతల్లి.

".... అమ్మా ! అనితా.... ఓలి నా బంగా రమా.... ఏటమ్మా.... ఏటయ్యిందే..." ఆతృత, అభిమానం, ఆందోళన, భయమూ కలగలసి పోయిన గొంతుతో రంగమ్మ.

"అమ్మా" ! అని బావురుమంటూ అనిత గొంతు ఫోనులోంచి.

"ఓలమ్మా ఏటయినాదే ? సెప్పు తల్లీ.... నాకు శానా గాబరాగా ఉందే...."

"అమ్మా.... మరేమో !! నిన్న సాయంత్రం నాకు కడుపులో నొప్పి వచ్చిందే...." వెక్కిళ్ళమధ్య చెప్తోంది అనిత.

".... నొప్పి ఇప్పుడు తగ్గిపోనాదా తల్లీ! బాబుగారిని ఏదన్నా మందుబిళ్ల అడగలేక పోయావా..."

"...... అది కాదే అమ్మా ! ఆ నొప్పి వచ్చిన తరువాత, నా లాగు తడిసిపోయిందే ఎర్రగా....."

కూతురు చెప్పిన విషయం బోధపడిన రంగమ్మ ఒక్కసారిగా కూలబడిపోయింది. చెవుల్లో గింగిరుమంటున్న కూతురు మాటలు. గుండెలో అలజడి.....

ఎన్నో వందల మైళ్ల అవతల కడుపున పుట్టిన బిడ్డ - అనాదలా - ఆడపుట్టుక పుట్టి, కన్నకూతురి మొదటి అవసరానికి అక్కరకురాని తన తల్లితనం సిగ్గుపడాలో - పేదరికంలో ఉండి కడుపు కక్కుర్తికి కూతురిని ఎవరితోనో ఎక్కడికో పంపిన తన మగని చేతకాని తనాన్ని చీదరించుకోవాలో తెలియక అలా అచేతనంగా ఉండిపోయింది రంగమ్మ.

"ఓలమ్మా !"

అనిత పిలుపుతో లోకంలోకి వచ్చింది.

"ఏటమ్మా"

"అమ్మా.... అమ్మా...." వెక్కిళ్లు మాటను అడ్డుకుంటున్నాయి.

"సెప్పమ్మా"

"...... నాకు ఈవలుంచీసినారే.... బువ్వ కూడా దూరం నుండి పెడతన్నారే"... (వెక్కిళ్లు)

"నా తల్లీ నానిప్పుడేటి సేస్తాను... ఏటి సెయ్యాల?"

"అమ్మా బయట గొప్ప సలిగున్నాదే... దోమలే... నాను నీ దగ్గిరికి ఎలిపోస్తానే....."

ఆ మాటలకు పేగులు తెగిపోయినంతగా మెలి తిరిగిపోయింది రంగమ్మ.

"సర్లే తల్లీ నానొచ్చి తీసుకొచ్చేస్తానే నిన్ను...."

"అలాగేనమ్మా" నువ్వు బేగిరా. నువ్వొచ్చి నంతవరకూ నేను బువ్వ తిన్ను... " గారంగా అంది అనిత.

"తప్పమ్మా అలగనకూడదు... బువ్వ తినమ్మా... ఆడపిల్లలకి అలగయినప్పుడు ఎవులేనా అలాగే సూస్తారు... ఏటనుకోకు.... నాను అక్కడికి

వస్తాను కదా ! నా బంగారానివి కదూ !!" ఊర డిస్తోంది.

ఇంతలో ఫోన్‌లోంచి గొంతు మారింది.

".... పాప భయంతో ఏదో మాట్లాడుం టుంది. మీరేమీ భయపడకండి. యివన్నీ మామూలే. మేం జూసుకుంటాం... వీలయితేనే మీరు రండి.."అవ తలి నుంచి యజమానురాలి గొంతు సౌమ్యంగానే.

సర్పంచ్ కూతుర్ని రంగమ్మ ఎరుగును. మంచిదే. అయినా మన పిల్ల బెగిలిపోయిందే. ఏటి చేత్తును....

అని మనసులో తలపోసి ఫోన్ పెట్టేసి లేచింది.

ఇదంతా చూసిన సర్పంచ్ భార్య రంగమ్మ నుద్దేశించి –

"పెద్ద పిల్లయింది గావాల... అలు సూసు కుంతార్లేయే... ఉట్టినే గుండపిండయిపోకు.. అంది యదాలాపంగా...

ఆమాటనీ ఆమెనీ పట్టించుకోలేదు రంగమ్మ. సర్పంచ్‌ను వెదుక్కుంటూ వెళ్లింది.

కళ్లంలో ఎవరెవరితోనో మాట్లాడుతున్నాడు సర్పంచ్. అతణ్ని కలసి దండం పెట్టింది. విషయ మంతా చెప్పింది.

"అయితిప్పుడేటంటావే?! ఆళే తానంగ్రటా చేయించి లోపల పెడతార్లే...." నిర్లక్ష్యంగా చెప్పాడు.

"అదేటి బాబూ అలగనీసేవు?! బిడ్డను ఈడకు తీసుకొచ్చేస్తాను....." మాట పూర్తి కాలేదు.

"తీసుకొచ్చేస్తావా?! తెచ్చియ్యే అయితే...." అన్నాడు కోపంగా. అందుకు రంగమ్మ –

"అది కాదు బాబూ..ఓట్లకోసం హైద్రా బాద్‌కి బస్సేస్తన్నారు కదా ఆ బస్సులో నాకూ కసింత సోటిస్తే నానెల్లి నా బిడ్డను తెచ్చుకుంటాను బాబూ...."

ఆమాట బాగానే ఉంది గానీ మనం హైద్రాబాద్‌కు బస్సు ఎయ్యట్లేదే. అందుకని ఆ గుంటని ఇక్కడికి తెచ్చే ఆలోచనని మానుకొని ఇంటికెళ్లు...." సంభాషణ తెంచేసాడు సర్పంచ్.

చేసేది లేక భర్తతో చెప్పుకుందామని ఇంటికి బయలుదేరింది.

సర్పంచ్ ఇంటిదగ్గర ఒకరిద్దరి ద్వారా ఈ కొంచెం సమయంలోనే గ్రామంలో సగం మందికి విషయం తెలిసిపోయింది.

దారిలో రంగమ్మని పలకరిస్తున్నారు.

"ఔనే ! రంగా ! ఇలపింటప్పుడైనా మన అన్నోళ్లు నేకపోతే ఎలగే !?" చనువున్న ఓ ముసలమ్మ నిష్టురమాడింది.

రంగమ్మ సిగ్గుతో తల వాల్చేసింది.

అంతలో –

"ఓలె రంగమ్మా" పిలుపు వినబడి అటు చూసింది.

జోగులయ్య. సర్పంచ్‌కు పోటీగా నిలబడు తున్న అవతల పార్టీ మనిషి.

దగ్గరకెళ్లి తనగోడు వెళ్లబోసుకుంది.

"... రంగమ్మా మీ ఇంట్లోవి రెండోట్లూ నాకు ఎయ్యండే.... అలగైతే మేము హైదరాబాద్ పంపుతున్న బస్సులో నిన్నెక్కించుకుని ఎల్తామే... ఏ విషయం ఆలోచించుకొని చెప్పు. రేపు ఉదయమే బస్సు బయలుదేరుతాది...." ఇక నీ యిష్టం అన్నట్టు వెళ్ళిపోయేడు జోగులయ్య.

అతడికి తెలుసు. రంగమ్మ భర్త వీర్రాజు సర్పంచ్ వెనక తిరుగుతున్నాడని. కానీ ఎవరి ఓటు ఆశ వారిది. అవసరాలు, అవకాశాలు ఎటువంటివో బాగా తెలిసినవాడు మరి.

✿ ✿ ✿

వాకిట్లో నులకమంచం మీద వీర్రాజు పడుకొని ఉన్నాడు....

వస్తూనే రంగమ్మ పెద్దశోకాలు పెడ్తూ వచ్చింది.

".... వద్దు వద్దంటే బిడ్డను తోలేసినావు. ఇప్పుడు సూడయ్యా ఎలాగ అయ్యిందో ! బిడ్డను యిక్కడికి తెచ్చుకుందామంటే డబ్బు లేదు. ఆ ప్రెసిరెంట్ యివ్వడు... సరికదా అక్కడికెళ్ళద్దం టాడు..." గగ్గోలు పెడుతూనే ఉంది.

"అయితే ఇప్పుడేటి సెయ్యిమంటావే....." అన్నాడు నిస్సహాయతలోంచి వచ్చిన చిరాకుతో.

అదిగో ఆ సేతకాని సిరాకే వద్దంటాను. నామాట తాపీగ ఇను. అవతల పార్టీ మనిషి జోగు లయ్య కలిశాడు. హైదరాబాద్ బస్సేస్తన్నారట. నన్ను తీసికెల్తారట..... అట్నుంచి పిల్లనీ నన్నూ తీసుకొచ్చే స్తారట. అయితే మనిద్దరి ఓట్లు రెండూ ఏస్తామని పిల్లమీద ప్రెమాణం చేస్తే బస్సు ఎక్కించి తీసికెళ్తా రట..." వివరించింది రంగమ్మ.

ఆ మాటలు విన్న వెంటనే వీర్రాజు దిగ్గున లేచి – రంగమ్మమీదికి ఉరికి – "ఒక్కటిచ్చీగల్ను" అన్నాడు.

"సేతగానోడికి శౌర్రిమెక్కువ.... పౌరిశానికి లోటు నేదు... ముండమొహానికి...." అంత జోరుగానే సమాధానమిచ్చింది, మొహం ఈసడిస్తూ.

"కాదేటి ! నీ మాటలు? పీకబోయిన అలాగ జరగదు... మనం వొవిలి పక్కన తిరిగితే ఆలికే ఓట్లు...." అని నిక్కచ్చిగా చెప్పి లేచి, తూలుతూ బుజం మీద తువ్వాలు దులిపి మళ్ళీ కూచుండి పోయేడు.

ప్చీ.... ఇతగాడు రోగం పాలయిపోయేడు... కాలుకీ సేయికీ తోడుంటాది అని అనవుసరంగా ఐడి మానిపించేసి తప్పుపని చేశ్నాను. ఆయిగా ఐడిలో సదువుకున్నా కంటికి కనిపిస్తూ ఉండేది.... నా బుద్ధి పొయ్యిల పెట్ట... నానాలుక రెండుగా సీలిపోనూ... ఈ నోటితోనే మేస్తుబాబుతో అబద్దం ఆడి దాన్ని మానిపించేసేను.... సుబ్బరంగా సదువు కుండేది.... తెగ ఆరాటపడిపోతోంది రంగమ్మ.

ఇంతలో – అటువైపుగా వచ్చిన ఆ ఊరి స్కూలు మాష్టారు "ఏమిటి రంగమ్మా గొడవ..." అని అడిగారు.

మొత్తం జరిగిందంతా రంగమ్మ ఏడుస్తూ చెప్పింది.

".... మీరు ఎంత వద్దంటున్నా సదూతున్న పిల్లని పంపించి తప్పు చేశ్నాం బాబూ !.... మా పాడు కడుపులు నింపుకోడానికి దాని బతుకు తీస్నాం బాబూ....." అంటూ ఏడవడం మొదలుపెట్టింది.

"..... అనితను నేను తెప్పిస్తాను... రెసిడెన్షియల్ పరీక్ష రాయించి హాస్టలులో ఉండి చదువుకునేట్టు చేస్తాను....." రంగమ్మకు మాత్రం వినిపించేట్టు చెప్పి వెళ్ళిపోయేడు.

ఆ ఆధారం చాలనుకుంది. బిడ్డబతుకే ప్రధానమనుకుంది. తనలాగే కడుపుతీపి మొగుడు క్కూడా ఉంటుందనుకుంది. ఎన్నో విధాలుగా నచ్చజెప్పితే వింటాడనుకుంది. నచ్చజెప్పి జూసింది. లాభం లేకపోయింది.

అనితను పని మాన్పించేది లేదని –నెలకు వచ్చే డబ్బులు వొదులుకోలేనని తేల్చి చెప్పేశాడు – అదీ కాకుండా 'ఏదైనా మార్గం చేసి పిల్లనిక్కడికి తెచ్చేవంటే నిన్నేటి చెయ్యాలో అదిచేసి తీర్తా'నని శపథం కూడా చేశాడు. "ఏటి సేస్తావురా సేతకానోడా వొదిలేస్తావా?...." అడిగింది రంగమ్మ.

"ఆ.... అదే కోరిగ్గా ఉంటే అలాగే సేస్తానే....." అన్నాడు వీర్రాజు.

"ఆ ! నిన్ను చేసుకొని నేనూ – నీ కడుపున పుట్టి నా బిడ్డ ఏనాడు సుకపడిపోనాం. నీ యింట్లో అడుగెట్టిన నాటినుండి నీ యెనకే ఉన్నాను. ఇదిగో సేతులరిగిపోయినట్టు కాళ్లు బద్దలడిపోయినట్టు సుకపడిపోనాం ఇంకా నీకాడ మిగిలుండిపోయింది సుకం.... నన్ను ఏదైనా సేసేదానికి... సిగ్గులేని మొకం... వొదిలీడానికి సిద్ధపడిపోనాడు......ఛీ.... ఇప్పుడైనా పిల్లని నేను తెచ్చుకోలేకపోతే నా తల్లి తనానికే సిగ్గుచేటు.... అవుమానం ఏటి సేసుకుంటావో చేసుకో....." అంటూ మొగుణ్ణి దాటుకొని బయటపడింది.

కొంతదూరం నడిచి ఎందుకోసమో వెనక్కి తిరిగి చూసిన మాస్టారుకు పెద్ద పెద్ద అంగలతో వస్తున్న రంగమ్మ కనిపించింది.

మొగుణ్ణి కాదని తను వేసిన మొదటి అడుగు ఎనిమిదో అడుగులా తోచింది.